మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 158 | ఆదివారం | 30 - 11 - 2025 | పేజీలు: 8 | వెల: 4


## దిత్వా తుపాన్‌పై ప్రభుత్వ అప్రమత్తత




2లో..

# ఘోర రోడ్డు ప్రమాదం





- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి... మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఢీకొన్న డిజైర్, ఫార్చ్యూనర్ కార్లు
- కొటేకల్ గ్రామ సమీపం లో ఘటన

మనగళం, ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు మండలం పరిధి లోని కొటేకల్ గ్రామ సమీపాన శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. డిజైర్ కారు, ఫార్చ్యూనర్ కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక నుండి మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి ని దర్శించు కోడానికి కోలార్ జిల్లా, చిక్క ఒసల్లి గ్రామానికి చెందిన 7మంది సభ్యులు డిజైర్ కారులో బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున మంత్రాలయం వెళ్తుండగా.. కర్నూలు నుండి ఆదోని కి ఫార్చ్యూనర్ కారులో కొందరు వెళ్తున్నారు. కొటేకల్ గ్రామం, నగర వనం సమీపం లో ఈ కారులు ఢీ కొనడం తో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వెంకటేశ్ (65) భార్య గౌరమ్మ (60) కూతురు మీనాక్షి, అల్లుడు సతీష్, మనవళ్ళు రిత్విక్, బన్ని గౌడ్ లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికీ తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం కు కారణం పొగ మంచు ఉండటం వలన ఆదోని కి



వెళుతున్న ఫార్చునర్ సరైన మార్గం లో వెళుతున్నప్పటికీ కర్ణాటక వాహనం ఢీ కొట్టడం వలన ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఫార్చునర్ కార్ లో ఉన్న వ్యక్తులు సీట్ బెల్ట్ ధరించి ఉండం, ప్రమాదానికి గురైనప్పుడు కారులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అయ్యింది. దీంతో

2 లో..



## కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం

- కర్నూలుప్రభుత్వాసుపత్రిలో పూర్తి సౌకర్యాలు
- రాష్ట్ర పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం అని, ఆ మేరకు ఆస్పత్రిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తామని మంత్రి టి.జి.భరత్ తెలిపారు. శనివారం ఉదయం సర్వజన ఆసుపత్రిలో రూ. 41 లక్షలు ఖర్చుతో ఆధునీకరించిన 4 గదుల పేయింగ్ బ్లాక్ ను పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ప్రారంభించారు. అనంతరం మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ కర్నూలు సర్వ జన ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రస్తుతం పేయింగ్ బ్లాక్ లో నాలుగు గదుల సముదాయాన్ని ఆధునికరించి ప్రారంభించామన్నారు. ఇందులో ఒకటి సూట్ రూము, మిగిలినవి మూడు ఏసీ గదులని, ఇవి కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో ఉన్నాయని, డబ్బులు చెల్లించి వినియో గించుకునే వారికి సౌకర్యంగా ఉంటాయని తెలిపారు. ఇంకా ఆస్పత్రిలో అవసరం మేరకు

2 లో..

## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి





మనగళం, ప్రత్యేక ప్రతినిధి : భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు అంకితభావంతో కృషి చేయా లని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుపాటి పురం దేశ్వరి, రాజ్య సభ సభ్యులు పాక సత్యనా రాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపుని చ్చారు. రాజమహేంద్రవరంలో శనివారం భారతీయ జనతా పార్టీ గోదావరి జోన్ మండల అధ్యక్షుల ప్రశిక్షణ వర్గ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రశిక్షణ వర్గలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సంస్థాగత నిర్మాణం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాల గురించి చర్చించారు. అనంతరం వారు మండల అధ్యక్షులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపం చంలో అతిపెద్ద రాజకీయ శక్తి గా, దేశంలో అత్యధిక ప్రజాప్రతినిధులు కలిగిన బీజేపీలో మండల అధ్యక్షులుగా పనిచేసే అరుదైన అవకాశాన్ని వినియోగి ంచుకోవాలని కోరారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## రోడ్ల నిర్మాణానికి రూ.105.66 కోట్లు మంజూరు

- జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.105.66 కోట్లు మంజూరు చేసిందని కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు. ఈ నిధులను రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు వినియోగిస్తామన్నారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పరిధిలో 222.18 కి.మీ పొడవుతో రోడ్లకు సంబంధించిన 30 పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 105.66 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ధనాపురం–హొళగుంద రోడ్ (25.80 కి.మీ) నిర్మాణానికి రూ. 13.70 కోట్లు, బైచిగేరి నుంచి పెద్దకడుబూరు రోడ్ (13.750 కి.మీ)నిర్మాణానికి రూ. 6.40 కోట్లు, ఎమ్మిగనూర్, మాలపల్లి, కోసిగి రోడ్డు (కి.మీ 12.00) నిర్మాణానికి రూ. 7.40 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. త్వరలోనే ఈ పనులను చేపట్టేందుకు టెండర్ లను పిలిచి, ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు సకాలంలో పూర్తిచేయాలని రహదారులు మరియు భవనాలు శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పి.మహేశ్వర రెడ్డి ని ఆదేశించామని కలెక్టర్ వివరించారు.

# ఏపీకి కొత్త సీఎస్ నియామకం

- జి. సాయిప్రసాద్ 2026 మార్చి 1 నుంచి బాధ్యతలు - ప్రస్తుత సీఎస్ విజయానంద్‌కు మూడు నెలల పాటు పదవీ విరమణ పొడిగింపు
- 2026 మార్చి 1 నుంచి కొత్త సీఎస్ బాధ్యతలు స్వీకరణ - పది మంది డిప్యూటీ కలెక్టర్లకు కొత్త పోస్టింగ్‌లు

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కొత్త ప్రధాన కార్యదర్శి గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ నియమి తులయ్యారు. 2026 మార్చి 1వ తేదీన ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరిం చనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వ్యవహారాలు నిర్వహిస్తున్న సీఎస్ కె. విజయానంద్ పదవీకాలాన్ని ప్రభు త్వం మరో మూడు నెలలు పొడిగించింది. ఈ పొడిగింపుతో ఆయన 2026 మార్చి 28 వరకు పదవిలో కొనసాగనున్నారు. ఇందుకు సంబం ధించిన జీవో నెంబర్ 2230 విడుదలైంది. అలాగే రాష్ట్ర పరిపాలనా వ్యవ స్థలో భాగంగా పది మంది డిప్యూటీ కలెక్టర్లకు కొత్త నియోజకవర్గాల్లో పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది. దీనికి సంబంధించిన జీవో ఆర్టీ నెంబర్ 2228 ను ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రకటించారు. రాష్ట్ర పరిపాలనను సజావుగా, అంతరాయం లేకుండా కొనసాగించే ందుకు తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ కీలక పరిపాలనా మార్పులుగా గుర్తించబడుతున్నాయి.

## విశాఖ కేజీహెచ్‌లో అగ్ని ప్రమాదం

45 మంది రోగులను సురక్షితంగా తరలించిన సిబ్బంది అప్రమత్తత



విశాఖపట్నం, మన గళం : విశా ఖపట్నం లోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో శనివారం ఉదయం జరి గిన అగ్నిప్ర మాదం తృటిలో పెద్ద ప్రమా దాన్ని తప్పించింది. గుం డె జబ్బుల విభాగానికి చెందిన ఆఫీస్ రూమ్‌లో ఉన్న ఏసీలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో వార్డు మొత్తం దట్టమైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం సంభవించగానే అక్కడి రోగులు, సహాయకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పొగ కారణంగా కొందరికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగింది. అయితే ఆసుపత్రి సిబ్బంది అత్యంత వేగంగా స్పందించారు. అగ్నిమాపక శాఖకు సమాచారం చేరవేసిన వెంటనే, వార్డు లోని 45 మంది రోగులను హుటాహుటిన వేరే బ్లాక్‌కు తరలించి సురక్షితంగా కాపాడారు.

2 లో..

# ఘోర రోడ్డు ప్రమాదం



ఫార్చునర్ లో ప్రయాణిస్తున్నవ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కర్నూల్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి, కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్లా ఖ్వామీర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ మన ప్రభుత్వ వ్యవస్థ లో లోపాలు ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. మనదేశంలో చదువు లేకపోయినా డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తున్నారని, ఈ విధానం ఇతర దేశాలలో లేదని గుర్తు చేశారు. అదేవిధంగా రోడ్డు నిర్మాణం చేపట్టే ఇంజనీర్లు ప్రమాదాలు నివారించే విధంగా రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కర్ణాటక వాహన డ్రైవర్ నిర్లక్ష్యంలోనే ఈ ప్రమాదం జరిగిందని కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్లా ఖ్వామీర్ తెలిపారు. ప్రజల్లో అవగాహన రావాల్సిన అవసరం ఉందని ఎంవీ ఐ శశిరా దీప్తి చెప్పారు. ప్రమాదాల గురించి పలుమార్లు అవగాహన కల్పించినప్పటికీ ప్రజల్లో మార్పు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు.


# కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం



వివిధ విభాగాల్లో ఆధునిక పేయింగ్ బ్లాకులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజ్ నుండి ఎంతోమంది ప్రఖ్యాత డాక్టర్లుగా దేశ విదేశాల్లో సేవలు చేస్తున్నారని తెలిపారు. ప్రముఖ డాక్టర్లను ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో తీసుకొని వారి సూచనల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రెండు మూడు టర్మ్ లు పనిచేయగలిగితే గుజరాత్ ప్రభుత్వం లాగా ఆంధ్రప్రదేశ్ కూడా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ నూతన పేయింగ్ బ్లాక్ మంత్రి అందించిన రూ. 41 లక్షలు సిఎస్ఆర్ నిధులతో అందుబాటులోకి రావడం శుభ పరిణామం అన్నారు. ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు ఉండటం వలన వీటిని ఐసీయూ లాగా కూడా వినియోగించుకోవచ్చని, డబ్బులు చెల్లించ గల వారికి అందుబాటులో ఉండే విధంగా చార్జెస్ ఉంటాయని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్లేయింగ్ బ్లాక్ విషయం మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించి తమ టి.జి.వి సంస్థ నుండి సిఎస్ఆర్ ఫండ్స్ రూపంలో రూ 41 లక్షలు అందించి ప్రస్తుతం ఈ బ్లాక్ ఏర్పడడానికి మంత్రి భరత్ కారకులయ్యారని , మూడు నెలల లోపల ఈ పనులు పూర్తయ్యాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ , డిప్యూటీ సూపరిండెంట్ లక్ష్మీబాయి, సీఎస్ ఆర్ ఎమ్ పద్మజ, ఆర్ ఎంఓ వెంకటరత్నం, డీసీ హెచ్ ఎస్ జఫ్రుల్లా, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, రఘునాథ్ రెడ్డి, జగదీష్, ప్రదీప్, ఏపీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ కేజీహెచ్‌లో అగ్ని ప్రమాదం

ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తి స్థాయిలో అదుపు చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కేజీహెచ్ సూపరింటెండెంట్ ధృవీకరించారు. సిబ్బంది అప్రమత్తతతో ప్రాణాపాయం తప్పినప్పటికీ, ఇలాంటి ప్రమాదాలు కేజీహెచ్‌లో తరచూ జరుగుతుండటంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో ఎలక్ట్రికల్ సేఫ్టీ, పరికరాల సంరక్షణపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# అమరావతి అంతులేని కథేనా?

**- భూసేకరణపై చంద్రబాబును అంబటి రాంబాబు తీవ్రమైన విమర్శలు**

**- అమరావతిలో భూముల ధరలు పడిపోయాయని వ్యాఖ్య**

**- "రాజధాని పేరుతో దోపిడీ" చేస్తున్నారని ఆరోపణ**

**- రైతుల త్యాగం వృథా అవుతుందనే ఆవేదన**

మన గళం, అమరావతి : అమరావతి రాజధాని ప్రాజెక్టు విస్తరణ కోసం మరో దశ భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో స్పందించారు. అమరావతి కథ ఇక "అంతులేని కథ"గా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతిలో భూముల ధరలు గణనీయంగా పడిపోయాయని ఆరోపించారు. రాజధాని పేరుతో ప్రజలను మభ్యపెడుతూ దోపిడీకి పాల్పడుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పటికే అమరావతి రైతులు 35 వేల ఎకరాల భూములను స్వచ్ఛందంగా ఇచ్చారని, ప్రభుత్వ భూములతో కలిపి 50 వేల ఎకరాలతో ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నిర్మిస్తానని చంద్రబాబు చేసిన హామీలను గుర్తుచేశారు. ఇలాంటి భారీ



భూములు ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు, మళ్లీ భూసేకరణ ఎందుకు? అని అంబటి ప్రశ్నించారు. స్పష్టత లేకుండా పదేపదే భూసేకరణ గురించే చర్చించడం రైతుల్లో తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఇవ్వకపోవడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని అంబటి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో రైతులు భారీగా నష్టపోతున్నారని, రాజధాని పేరుతో రాజకీయ లాభాల కోసం భూసేకరణను పునరావృతం చేయడం తగదని ఆయన హెచ్చరించారు. అమరావతి భవిష్యత్‌పై రాష్ట్రంలో మళ్లీ వేడెక్కుతున్న రాజకీయ చర్చలకు ఈ వ్యాఖ్యలు నాంది పలికాయి.

# అమరావతి భూసేకరణపై వైఎస్ శర్మిలా విమర్శలు తీవ్రం

**- రెండో విడతపై ప్రశ్నల వర్షం**

**- తొలి విడతలో అభివృద్ధి ఎక్కడ?**

**- 54 వేల ఎకరాల వినియోగంపై ప్రశ్నించిన శర్మిలా**

**- ఐకానిక్ నిర్మాణాలు, వరల్డ్ క్లాస్ నగరం వాగ్దానాలపై అసంతృప్తి**

**- రెండో విడత భూసేకరణ వెనుక రియల్ ఎస్టేట్ ప్రయోజనాలున్నాయా అని ఆరోపణ**

మన గళం, అమరావతి : అమరావతి రాజధాని భూసేకరణ పై రాజకీయ వాదోపవాదాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ శర్మిలా రాష్ట్ర ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేశారు. తొలి విడతలో సేకరించిన 54 వేల ఎకరాల్లో అభివృద్ధి పూర్తిగా కనిపించకపోయినా రెండో విడత భూసేకరణ ఎందుకు అవసరమైందో ప్రభుత్వం వివరించాలన్నారు. వరల్డ్ క్లాస్ నగర హామీ, ఐకానిక్ నిర్మాణాలు, మొదటి విడతలో తీసుకున్న భూముల ప్రయోజనాలు అన్నీ ప్రశ్నార్థకంగా మారాయని శర్మిలా పేర్కొన్నారు. రైతులపై ఒత్తిడి పెంచుతూ కొత్త సేకరణలు అన్యాయమని ఆమె ఆరోపించారు. 34 వేల ఎకరాలు ఇచ్చిన 29 వేల మంది రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ దశలో ఉన్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల రాజధాని ప్రాజెక్టులో ఒక కిలోమీటర్ అయినా అభివృద్ధి జరిగిందా? అని ప్రశ్నించారు. సింగపూర్, జపాన్, ఢిల్లీ వంటి నగరాలను ఉదాహరణగా చూపుతూ పెద్ద కలలను చూపించి, ఇప్పుడు మరిన్ని భూములు అవసరమని చెప్పడం ప్రజలను సందేహాస్పద పరిస్థితుల్లోకి నెడుతోందని శర్మిలా విమర్శించారు. రెండో విడత భూసేకరణను ఆమె "రియల్ ఎస్టేట్ మాఫియా"గా అభివర్ణించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. భూసేకరణ పరిమాణాలపై కూడా శర్మిలా విమర్శలు చేసినట్టు తెలుస్తోంది. ముంబాయి విమానాశ్రయానికి 1850 ఎకరాలు, భోగాపురం విమానాశ్రయానికి 2200 ఎకరాలు ఉంటే, అమరావతికి 5000 ఎకరాలు ఎందుకు అవసరమైందని ప్రశ్నించారు. ప్రపంచ నగరాల్లోని ఒలింపిక్ స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల్లోనే నిర్మించబడుతున్నాయని, అమరావతి స్పోర్ట్స్ సిటీకి 2500 ఎకరాలు అవసరం పడడం



అనుమానాస్పదమని ఆమె అభిప్రాయపడ్డారు. గడిచిన 11 ఏళ్లలో పరిశ్రమలు ఏవీ రాని ప్రాంతంలో స్మార్ట్ ఇండస్ట్రీల పేరిట భారీ భూసేకరణ కొనసాగించడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. రెండో విడత భూసేకరణకు ముందు ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయాలని శర్మిలా కోరారు. తొలి విడతలో అభివృద్ధి చేయకుండా రెండో విడత భూములు ఇవ్వకపోతే మున్సిపాలిటీ అవుతుందని రైతులను బెదిరించడం దారుణమని తెలిపారు. ఇది రైతుల నుంచి భూములు ఇచ్చిన 29 వేల కుటుంబాలను మోసం చేసినట్టేనని ఆరోపించారు. అమరావతి నిర్మాణం కేంద్ర బాధ్యత అని, కేంద్ర ఆర్థిక మంత్రి రాష్ట్రానికి వచ్చినప్పుడు అభివృద్ధి సహాయం కోరడం బదులు రాజకీయ ప్రదర్శనలు చేయడం సరైంది కాదని ఆమె తీవ్రంగా విమర్శించారు. అమరావతి పేరుతో తీసుకుంటున్న అప్పులు పౌరుల భవిష్యత్తుపై దీర్ఘకాలిక భారం పెడతాయని శర్మిలా వ్యాఖ్యానించారు.

# దిత్వా తుపాన్‌పై ప్రభుత్వ అప్రమత్తత

**- ప్రభావిత జిల్లాలకు ముందస్తు చర్యలు, టోల్‌ఫ్రీ నంబర్లు విడుదల**


**- విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో సమీక్ష చేసిన మంత్రి అనిత**

**- బలగాలను సిద్ధంగా ఉంచాలని సూచనలు, క్షేత్రస్థాయిలో యంత్రాంగం అలర్ట్**

మన గళం, అమరావతి : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడి ఉత్తర దిశలో వేగంగా కదులుతున్న దిత్వా తుపాన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖతో మంత్రి అనిత వంగలపూడి సమీక్ష నిర్వహించి, తుపాన్ ప్రభావం ఉండే జిల్లాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తీర ప్రాంతాలు, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు, గాలివానలు తీవ్రత సాధించే అవకాశం ఉన్నందున ఏ చిన్న నిర్లక్ష్యానికీ తావు ఇవ్వొద్దని మంత్రి పేర్కొన్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో బలగాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించేందుకు ఈ బలగాలు పూర్తిస్థాయి సామగ్రితో సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అనుక్షణం అప్‌డేట్‌లతో పహారా కాస్తూ ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించాలని సూచించారు. విద్యుత్, రహదారి, నీటి సరఫరా, పంటల రక్షణ వంటి అంశాలలో విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు, గాలులు ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇంట్లోనే ఉండాలని మంత్రి హెచ్చరించారు. తుపాన్ సమీపిస్తున్న తరుణంలో అవసరం లేని ప్రయాణాలు పూర్తిగా మానుకోవాలని, నీటిముంపు ప్రాంతాలు, చెరువుల సమీపాలు, బీచ్ ప్రాంతాలకు వెళ్లకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి తెలిపారు. అవసరమైన చోట్లో ప్రాథమిక సహాయక కేంద్రాలు, వైద్య బృందాలు సిద్ధంగా ఉండేలా అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిపారు. అత్యవసర సహాయ చర్యల కోసం ప్రభుత్వం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులోకి తెచ్చింది. ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చినా 112, 1070, 1800%-425-%0101




నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చని మంత్రి అనిత వంగలపూడి చెప్పారు. తుపాన్ దిశ, తీవ్రతపై ప్రభుత్వం నిరంతరం పరిశీలన కొనసాగిస్తోందని, ప్రజల భద్రతే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. తుపాన్ సమయంలో ప్రజలు అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# రాజధాని పేరుతో సీఎం చంద్రబాబు దోపిడీకి పాల్పడుతున్నారు

**– కర్నూలు జిల్లా వైకాపా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి**

మన గళం,కర్నూలు రాజవిహార్ : రాజధాని పేరుతో సీఎం చంద్రబాబు మరో దోపిడీకి పాల్పడుతున్నారని వైకాపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆరోపించారు. శనివారం నగరంలోని స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ క్యాబినెట్ లో 44,600 ఎకరాల కోసం తీర్మానాన్ని ఆమోదించారని, లక్ష కోట్ల నిధులు ఖర్చు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. అమరావతి పేరుతో ఇన్ సైడ్ ట్రేడింగ్ కు పాల్పడుతున్నారన్నారు. కర్నూలు ప్రభుత్వ క్వార్టర్స్ ను హైకోర్టు బెంచ్ తో కూటమి నేతలు దోచుకోవాలని చూస్తున్నారనే అనుమానాలున్నాయన్నారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి ఏమైనా ఉత్తర్వులు వచ్చాయా ? అని ఆయన ప్రశ్నించారు. ల్యాండ్ పులింగ్ పేరుతో 98,500 ఎకరాలను కూటమి ప్రభుత్వం సేకరిస్తుందని, దీనిని చూపించి 1.40 లక్షల కోట్ల అప్పులను కూటమి ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. ఈ అప్పులతో



ప్రజలపై 25 వేల కోట్ల రూపాయలు వడ్డీ భారం పడుతుందన్నారు.

# కారు ప్రమాద బాధితులకు మంత్రి టి.జి.భరత్,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పరామర్శ

మన గళం, కర్నూలు వైద్యం : ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామ సమీపంలో జరిగిన కారు ప్రమాద బాధితులను మంత్రి టి.జి.భరత్ ,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పరామర్శించారు. శనివారం ఉదయం రాష్ట్ర పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి , కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కాజువాలిటీ విభాగాన్ని సందర్శించారు.కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామ సమీపంలో జరిగిన ఘోర కారు ప్రమాద ఘటన లో గాయపడ్డ కర్ణాటక రాష్ట్ర కొల్లార్ జిల్లా బంగారు పేట వాస్తవ్యులు , ఒకే కుటుంబానికి చెందిన గంగమ్మ వయసు 55 సంవత్సరాలు మరియు చేతన్ కుమార్ వయసు 25 సంవత్సరాలు చికిత్స పొందుతున్న వారికి అందుతున్న చికిత్స వివరాల గురించి డాక్టర్ల తో అడిగి తెలుసుకున్నారు. వారికి అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. ఈ పర్యటనలో సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సి ఎస్ ఆర్ ఎమ్ పద్మజ , ఆర్ ఎం ఓ వెంకటరత్నం ,



డిసిహెచ్ఎస్ జఫరుల్లా, సంబంధిత డాక్టర్లు పాల్గొన్నారు.

# ఇల్లు మంజూరుకు దరఖాస్తు చేసుకోండి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పీఎంఏవై-2.0 గ్రామీణ్ కింద గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగి, ఇల్లు లేని వారు నవంబర్ 30 వ తేదీ లోపు తమ పేరును నమోదు చేసుకునేందుకు చివరి అవకాశం అని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం ఉన్నవారు, ఇంటి స్థలం లేని వారు సంబంధిత సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా తమ పేరు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇల్లు మంజూరు అయిన వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలకు మించి మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 30వ తేదీ తర్వాత పేరు నమోదు చేసుకోవడానికి అవకాశం లేనందున, గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని వారు త్వరితగతిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆయా మండలాల ఎంపీడీవోలు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అర్హత కలిగి, ఇళ్లు లేని వారి పేర్లు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 30.11.2025 తేదీ వరకే చివరి అవకాశం ఉన్నందున,అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# 13న జాతీయ లోక్ అదాలత్



మనగళం, కర్నూలు సిటీ : స్థానిక జిల్లా కోర్టు లోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో డిసెంబర్ 13 న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న సివిల్ మరియు రాజీ కాదగిన కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ను డిసెంబర్ 13 వ తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్లను చేసి ఎక్కువ కేసులు పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించి ఈ లోక్ అదాలత్ ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయమూర్తులు పాల్గొన్నారు.

# 3డిసెంబర్ 1న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమం

**– అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు – జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

8మన గళం,కర్నూలు కలెక్టరేట్ : వచ్చే నెల డిసెంబర్ 1 వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటలకు కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు : అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులుమీకోసం.ఏపి.జీఓవి.ఇన్. (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.




# రోడ్డు ప్రమాదం పై ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి

మన గళం,కర్నూలు రూరల్ : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన పై కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..రోడ్డు ప్రమాదం పై అధికారుల తో మాట్లాడి వివరాలు తెలుసుకున్న ఆయన ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు...రెండు కార్లు ఢీ కొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలచి వేసిందని విచారం వ్యక్తం చేశారు... మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్న ఎంపీ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు..



# కారుణ్య నియామకాలు చేపట్టాలి

మనగళం, ఎమ్మిగనూరు : ఐఎఫ్ టీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 13 రోజులుగా ఎమ్మిగనూరు మున్సిపల్ ఆఫీస్ ఎదుట కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇవ్వాలని రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారికి బహుజన సమైక్య సమితి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ సంఘీభావం తెలియజేశారు.ఈ సందర్భంగా అమ్రేష్ మాట్లాడుతూ రెండు వారాల క్రితమే జిల్లా కలెక్టర్ పారిశుద్ధ కార్మికులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశాలు పాస్ చేసిన ఎమ్మిగనూరు టౌన్ మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. తక్షణమే వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేయాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు, వివిధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# టీచర్స్ ప్రొటెక్షన్ పాలసీని ప్రవేశపెట్టాలి

**– ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొత్తూరు సత్యం డిమాండ్**

మన గళం,కర్నూలు ఏ.క్యాంప్ : విద్యార్థి చదవకపోయినా పేరెంట్స్ వెంటనే టీచర్ను తప్పు పట్టడం ఓ ఫ్యాషన్ అయిపోయింది అని టీచరు దండిస్తే పేరెంట్స్ దాడి చేయడం ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే టీచర్స్ ప్రొటెక్షన్ పాలసీని ప్రవేశపెట్టాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మేనేజ్మెంట్ లేదా ప్రభుత్వం కూడా టీచర్ పైనే చర్యలు తీసుకోవడం దీంతో టీచర్లలో భయం ఒత్తిడి అసంతృప్తి పెరుగుతున్నదని ఎందుకు ఇలా జరుగుతుంది చదువు ఫలితాలను ఒక టీచర్ పై మాత్రమే ఆధార పెట్టడం బాధ్యతను కుటుంబం విద్యార్థి స్కూల్ మధ్య సమానంగా పెంచుకోకపోవడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో సమాజంలో ఉపాధ్యాయుల పట్ల గౌరవం తగ్గడం స్కూల్ మేనేజ్మెంట్ ఫీడ్బ్యాక్ పేరుతో ఉపాధ్యాయులపై అధిక ఒత్తిడి పెట్టడం దీనికి సరైన పరిష్కారం పేరెంట్స్ టీచర్స్ పార్టనర్షిప్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. సమస్య ముందుగానే గుర్తిస్తే చివరి నిమిషంలో తప్పు కట్టే పరిస్థితి ఉండదని ప్రభుత్వం ద్వారా టీచర్స్ ప్రొటెక్షన్ పాలసీని ప్రవేశపెట్టాలని వైద్యులు పోలీసులకు ఉన్నట్లే ఉపాధ్యాయులు కూడా రక్షణ చట్టాలు ఉండాలని శారీరకంగా లేదా మాటలతో దాడి చేసే పేరెంట్స్ పై కఠిన చర్యలు తీసుకునే నిబంధనలో ఎంతో అవసరమని ఆయన తెలిపారు. విద్యార్థి బాధ్యత అంటే చదువుకోవడం ఓవర్ చేయడం క్రమశిక్షణగా ఉండటం ఇకపోతే తల్లిదండ్రుల బాధ్యత పర్యవేక్షణ సహకారం మరోవైపు టీచర్ బాధ్యత పాఠ్య బోధన మార్గదర్శకం ఇవన్నీ కలయిక ఎంత అవసరమని ఆయన తెలిపారు. విద్యార్థి ఫెయిల్ అయితే 100% తప్పు అనడం సమంజసం కాదని ఆయన తెలిపారు ఆ ఆ ఆఫ్ చెయ్ స్కూల్ మేనేజ్మెంట్ రిఫార్మ్స్ టీచర్లను ఇబ్బంది పెట్టి అనవసరపు టార్గెట్లు తగ్గించాలి విద్యార్థుల చదువులో ప్రగతి గురించి ప్రోగ్రెస్ రికార్డులు నిర్వహించే మేనేజ్మెంట్ టీచర్స్ పేరెంట్స్ కలిసి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. టీచర్లను సాఫ్ట్ టార్గెట్గా చూపించే న్యూస్ స్టోరీలను తగ్గించాలని సమాజంలో టీచర్ గౌరవాన్ని పెంచే ప్రచారాలు ఎంతో అవసరమని ఆయన తెలిపారు. విద్య అంటే టీచర్ ఒక్కడి బాధ్యత కాదని అది విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల ప్రభుత్వం అందరూ కలిసి చేసే ప్రక్రియ అని తెలిపారు టీచర్ పై దాడులు తక్కువ కావాలంటే వ్యవస్థలో మార్పు రావాలని బాధ్యతను అందరు పంచుకోవాలని టీచర్ కు రక్షణ మరియు గౌరవం కలగాలి అని తెలిపారు. ఈరోజు సామాన్య ఉద్యోగి నుండి రాష్ట్రపతి వరకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. విద్యార్థి చదువుల్లో వెనుకబడితే బాధ్యత ఎవరిది ఉపాధ్యాయులపై దాడులు ఎందుకు జరుగుతున్నాయి అన్న విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థి ఫెయిల్ అయిన క్లాసులో దృష్టి పెట్టకపోయినా చివరి బాధ్యత పడేది టీచర్ పని ఇది ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. పేరెంట్స్ కోపం మేనేజ్మెంట్ లేదా ప్రభుత్వ చర్య ఇవన్నీ టీచర్ పైన పడుతున్నాయి కొన్నిసార్లు మాటల గాడి కొన్నిసార్లు శారీరక దాడి కూడా ఎక్కువ అవుతుంది ఆయన అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రైతు విత్తనం వేశాడు వర్షం రాకపోయినా నేల సహకరించకపోయినా మొక్కను ఎవరు నీరు పెట్టకపోయినా పంట రాకపోతే రైతునే దోషి చేయడం ఎలా ఇది ఎంతవరకు న్యాయమో ఆలోచించాలి. అదే విధంగా విద్యార్థి చదవకపోతే



ఇంట్లో పర్యవేక్షణ లేకపోవడం మొబైల్ సోషల్ మీడియా అలవాట్లు పెరిగితే 100% బాధ్యత టీచర్లపైనే పడుతున్నది ఇది ఇంతవరకు న్యాయము ప్రభుత్వం కూడా ఆలోచించాలి దీనివల్ల విద్యా వ్యవస్థకు కూడా నష్టం కలుగుతుంది .గతంలో పేరెంట్స్ మీటింగ్ జరిగేది కాలక్రమమైన కనుమరుగైపోయిందని ఆయన తెలిపారు. టార్గెట్లు ఒత్తిడి భయపెట్టి విధానాలు పూర్తిగా రద్దు కావాలి అని తెలిపారు. టీచర్ను గౌరవించని సమాజం భవిష్యత్తును గౌరవించదు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని అని తెలిపారు విద్యార్థి వైఫల్యం కూడా అందరం కలిసి చూడాల్సిన బాధ్యత కేవలం టీచర్ను శత్రువుగా కాకుండా మన పిల్లల భవిష్యత్తును నిన్ను నిర్మించే సహాయకుడిగా చూడాలి అందరూ కలిసి పనిచేస్తేనే సురీక్షితమైన పాఠశాలలు గౌరవం ఉన్న టీచర్లు మెరుగైన భవిష్యత్తు కలిగిన విద్యార్థులు తయారు చేసుకునే అవకాశం ఉంటుందని అని తెలిపారు.


# అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు



- నగరపాలక అధికారుల సమీక్షలో మంత్రి టీజీ భరత్
- రహదారుల విస్తరణ పనులు మరింత వేగవంతం చేయండి
- పిపిపి పద్దతిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్ అభివృద్ధికి ప్రతిపాదనలు

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, టెండర్ల ద్వారా పనులు పొందినప్పటికీ ప్రారంభించని గుత్తేదారులపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ.భరత్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి మంత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్, సంబర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలోని 129 ఎకరాల్లో పిపిపి ప్రాజెక్టుల ద్వారా నగర ప్రజలకు అధునాతన సౌకర్యాలు, కార్పొరేషన్‌కి ఆదాయం వచ్చేలా రూపకల్పన చేసిన ప్రతిపాదనలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ ప్రతినిధులు వివరించారు. తాగునీటి సరఫరా మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, గుత్తేదారుల సమస్యలు పరిష్కరిస్తూనే ఉన్నప్పటికీ జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. అలసత్వం వహిస్తున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనత తగదని హితవు పలికారు. ఇతర శాఖలతో సమన్వయం పెంచుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని, కల్లూరు దర్వాజ వద్ద బ్రిడ్జి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కార్పొరేషన్ ఆదాయం పెంపునకు కృషి చేయాలని, ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. నగరాన్ని స్మార్ట్ సిటిగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, నగర అభివృద్ధి విషయంలో ఏ అవకాశాన్నీ వదలకుండా ప్రగతిని సాధించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. పిపిపి పద్దతిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను ఆకర్షణీయంగా, అధునాతన సాంకేతిక అంశాలతో ఆహ్లాదకర వాతావరణంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. సంబర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలోని 129 ఎకరాల అభివృద్ధికి ఐకానిక్ టవర్, భవన సముదాయాల ఏర్పాటు వంటి అంశాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు వివరించారు కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఇంచార్జ్ సీపీ బి.వెంకటరమణ, ఆర్‌ఓ జునైద్, ఎంఈ మనోహర్ రెడ్డి, ఏపీయస్‌పిడిసిఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష సమావేశం



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీ బి. లీలా వెంకట శేషాద్రి న్యాయ సేవా సదన్ నందు "హిట్ అండ్ రన్ కేసులపై శనివారం డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్" నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసుల వేగవంతమైన ప్రక్రియకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీలతో సమన్వయం చేసుకొని హిట్ అండ్ రన్ కేసుల క్లైములు వేగవంతమైన ప్రక్రియ కోసం, జనరల్ ఇన్సూరెన్సుకు క్లైములను సమర్పించడం కోసం రెవిన్యూ, పోలీస్ మరియు బీమా కంపెనీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అలాగే హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు లేదా వారిపై ఆధారపడిన వారికి అర్హత ప్రకారం పరిహారం చెల్లింపు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్స్, డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్స్, డిటి ఆర్ బి అధికారులు, డి ఎం అండ్ హెచ్ ఓ అధికారులు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల బ్లడ్ బ్యాంకుకు ప్రశంసలు

- రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన బ్లడ్ బ్యాంక్

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లో ఉన్న బ్లడ్ బ్యాంకు రాష్ట్రంలోనే అత్యధికంగా 11531 యూనిట్ల బ్లడ్ కలెక్ట్ చేసినందుకు ఉత్తమ సేవ అవార్డు కు ఎంపికైంది. దీంతో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ కాలేజీ ప్రిన్సిపాల్, డాక్టర్.చిట్టి నరసమ్మ, అడిషనల్ డీఎంఈ అండ్ హాస్పిటల్స్ సూపర్డెంట్, డాక్టర్ వెంకటేశ్వర్లు, పెథాలజీ విభాగాపు అధిపతి డాక్టర్ బాలీశ్వరి తదితరులు బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా.రంగస్వామి ని అభినందించారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ అధికారులు అభినందనలు అందుకోనున్నారు.

# ఉపాధి పనులు కల్పించాలి



మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయ పనులు లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి నారాయణ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణయ్యకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న, నాయకులు కే మధు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పీడీకి సమస్యలను వివరించారు. వలసల నివారణ కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉన్న ఆ పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఉపాధి హామీ చట్టంలో రాజకీయ జోక్యం పెరిగిందని, క్షేత్రస్థాయి సిబ్బందిపై వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# శ్రీ అయ్యప్ప స్వామి వారికి వెండి కిరటం సమర్పించిన, యువనేత బుసినే మారుతి.



( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండల కేంద్రంలో శ్రీ రాచుటయ్య స్వామి దేవాలయం నందు అయ్యప్ప స్వామి వారికీ వెండి కిరీటం సమర్పించిన ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి సోదరుడు బుసినే వెంకటేష్ తనయుడు యువనేత బుసినే మారుతి. అనంతరం అయ్యప్ప స్వామి వారికి కుటుంబ సమేతంగా అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏమ్మెల్యే సోదరుడు బుసినే శ్రీరాములు, యువనేత రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ బుసినే చంద్రశేఖర్, మరియు బుసినే మధుసూదన్, అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్స్ కు గుర్తింపు సర్టిఫికెట్ల పంపిణీ



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈరోజు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ట్రాన్స్‌జెండర్ గుర్తింపు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 17 మంది దరఖాస్తుదారుల్లో 16 మంది అర్హులుగా తేలగా సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని ఆసుపత్రి అడిషనల్ డీఎంఈ అండ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఎంఓ డాక్టర్ సునీల్ ప్రశాంత్,వి జయ మహిళ మండలి ప్రోగ్రామ్ మేనేజర్ విజయ, ఏఎన్ఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : గ్రామీణ స్థాయిలో ఉన్న సమస్యలపై అవగాహన పెంచుకుని పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అఖిల భారత సర్వీస్ లకు చెందిన అధికారులు శిక్షణ నిమిత్తం కర్నూలు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అఖిల భారత సర్వీస్ లకు చెందిన అధికారులు శిక్షణ నిమిత్తం కర్నూలు జిల్లాకు అధికారులు విచ్చేసిన సందర్భంగా వారు గ్రామాల్లో పర్యటించినప్పుడు ఎదురైన సమస్యలపై ఆరా తీశారు. శానిటేషన్ ఏ విధంగా ఉంది, పిల్లలకి వడ్డిస్తున్న మిడ్ డే మిల్స్ ఏ విధంగా ఉంది, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది, అని ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాగుందని, పిల్లలకి వడ్డిస్తున్న మిడ్ డే మిల్స్ బాగుందని అధికారులు తెలిపారు. అయితే శానిటేషన్ కొంత మెరుగు పడాలని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు. క్షేత్ర స్థాయి పర్యటనల వల్ల సమస్యలు తెలుస్తాయని, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నందువల్ల, సమస్యలపై దృష్టి సారించి, ప్రజలకు సేవ చేయాలని కలెక్టర్ అఖిల భారత సర్వీసుల అధికారులకు సూచించారు. సమావేశంలో అఖిల భారత సర్వీస్ లకు చెందిన అధికారులు, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్లపరి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే





మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని కల్లపరి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమము ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు శాసనసభ్యులు శ్రీ బొగ్గుల దస్తగిరి మరియు టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మరియు సింగిల్ విండో ప్రెసిడెంట్ కోడుమూరు వారు మరియు లద్దగిరి వారు మరియు మండల టిడిపి నాయకులు గ్రామ రైతులు మరియు సచివాలయ సిబ్బంది అగ్రికల్చర్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామ రైతు ఇంటి దగ్గరికి వెళ్లి వారికి రైతన్న మీకోసం ప్రోగ్రామ్ గురించి చెప్పి వారికి కావలసినటువంటివి తెలుసుకొని వాటిని నివేదికలు తయారు చేసుకోవడం జరిగినది ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ నీటి భద్రత ప్రతి రైతు కూడా నీటిని భూమిలో ఇంకిపోయేటట్టు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని భూమిలో జలవనరులు పెరిగేటట్టు చూసుకోవాలని ముఖ్యంగా ప్రతి రైతు కూడా డ్రిప్పు పద్ధతిలో వాడును ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని 100% సబ్సిడీ కింద ఇస్తున్నందువలన ప్రతి రైతుకు వారు తెలియజేశారు అలాగే రెండవది డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేసుకోవాలని ఒకే పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడం వలన పండించిన పంటకు మార్కెట్ ధర ఉండక రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితిలు తలెత్తునని తెలుపుతూ మిశ్రమ పంటలు సాగు చేసి అధిక దిగుబడును పొందాలని ఈ సందర్భంగా తెలియజేశారు అలాగే మూడో విషయమైనా అగ్రిటెక్ విధానంలో టెక్నాలజీతో రైతులు పంటను పండించాలని తద్వారా అదికాదాయం పొందవచ్చని దానికోసం సబ్సిడీలు ప్రోత్సహిస్తున్నామని డ్రోన్లు తైవాన్ స్ప్రేయర్లు వంటి వాటిని ఇతర టెక్నాలజీకి సంబంధించిన పనిముట్లను వాడాలని వారు తెలిపారు ఇందులో భాగంగా నాలుగో విషయము ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా రైతు పండించిన పంటకు అధిక ధర వచ్చే విధంగా ఇంటి అవసరాలకు కాకుండా వివిధ రకాలైనటువంటి ప్రొడక్ట్స్ తయారు చేయడానికి ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా సబ్సిడీలు అందించి రైతుకు మేలు చేస్తుందని వారు వివరించారు అలాగే పంచసూత్రమైన ఐదో విషయ ప్రభుత్వం నుంచి మద్దతుగా రైతన్నలకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ అంటే పథకాలను మరియు అతివృష్టి అనావృష్టి కారణాలతో నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారము మరియు ఉల్లి రైతులకు హెక్టార్కు 50,000 చొప్పున గరిష్టంగా రెండు హెక్టార్లకు లక్ష రూపాయలు చొప్పున ఇవ్వడం జరుగునని వారు తెలియజేశారు రైతన్నలందరికీ మీకోసం కార్యక్రమంలో పై పంచ సూత్రాలను ఎమ్మెల్యే వివరించారు ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి రైతులతో మాట్లాడుతూ పాడి రైతులకు అండగా పరిశుద్ధానా టీకాలు గోకులాలు పశుగ్రాసాల పెంపకం నీళ్ల తొట్టెల నిర్మాణం వంటి వాటిని పాడి పరిశ్రమ అభివృద్ధికి ఏర్పాటు చేస్తున్నామని అలాగే సంపద సృష్టి జరగడానికి పెద్ద ఎత్తున పెట్టుబడును ఆకర్షిస్తున్నామని రైతులందరికీ ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు టిడిపి శ్రేణులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఆదోని జిల్లా చేసేంతవరకు పోరాటం ఆగదు

మనగళం, ఎమ్మిగనూరు : కరువు వలసలకు నిలయం అయినా పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలి అంటే ఆదోని ని జిల్లా చేయాలని రాయలసీమ విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, ఖాజా, ఆఫ్రిది, రఘు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు లో స్థానిక కార్యాలయం నందు ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, విద్య.. వైద్యం అందాలన్నా పరిశ్రమలు రావాలన్నా... ఆదోని ని జిల్లా గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆదోని డివిజన్లో వలసలు కరువు తగ్గి పేద బడుగు బలహీన వర్గాల బ్రతుకులో మారాలంటే ఆదోని జిల్లా చేయాల్సిందే అని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొంత ప్రాంతమని ఆదోని అని చెప్పుకునే మంత్రి టీజీ భరత్ స్పందించకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమన్న ఇర్ఫాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# అన్నదాత సుఖీభవ కరపత్రాలను అందజేస్తున్న మండల టిడిపి నాయకులు...

నందవరం నవంబర్ 29 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని స్థానిక పెద్దకొత్తలి గ్రామంలో మరియు పెద్దకొత్తలి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది సీనియర్ నాయకులు మండల టిడిపి కన్వీనర్ కాసి%శీ%వాలి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు నియోజకవర్గ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 'రైతన్నా.. మీ కోసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల ఇళ్లకు నేరుగా వెళ్లి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు 'పంచసూత్రాల' అమలు ద్వారా కలిగే లాభాలను వివరించనున్నారు. రైతులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ విధానాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయం, అనుబంధ శాఖలు, మార్కెటింగ్ అధికారులు, సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచసూత్రాలు %-% నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు %-% అమలుపై లోతైన చర్చ జరిగింది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది ముందుండి ఈ కార్యక్రమాన్ని సఫలీకృతం చేయాలని సీఎం ఆదేశించారు. సీఎం మాట్లాడుతూ గత 17 నెలలుగా రైతులు, వ్యవసాయాన్ని ముందుకు తీసుకొచ్చాం. 'అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్' కింద 46.50 లక్షల మంది రైతులకు రూ.14 వేల చొప్పున జమ చేశాం. బిందు సేద్యం, పొలం పిలుస్తోంది కార్యక్రమాలతోపాటు ఇప్పుడు పంచసూత్రాలతో రైతులకు మరింత మేలు చేకూరుస్తున్నాం. పాడి, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, ఆక్వా, ఉద్యానవన, సెరికల్చర్ రంగాల రైతులకు కూడా ఈ అవగాహన అందాలి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, భూసార రక్షణతోపాటు ఆరోగ్యాన్ని కాపాడాలి. రైతు



బజార్లలో ప్రకృతి ఉత్పత్తులకు ప్రత్యేక స్థానం కల్పించాలి" అని పేర్కొన్నారు. పురుగుమందుల అధిక వినియోగం నష్టాలు, సేంద్రీయ విధానం ద్వారా విదేశీ మార్కెట్లలో డిమాండ్, భూసార పరీక్షలు, సమర్థ నీటి నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి అంశాలను రైతులకు ఇంటింటా వివరించాలని సీఎం ఆదేశించారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహించి, రైతుల సమస్యలు నేరుగా తెలుసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. మండల క్లస్టర్ ఇంచార్జి వన్ వీరేష్ పేట సర్పంచ్ ఉదయ్ కుమార్ గౌడ్. టిడిపి సీనియర్ నాయకుడు సామెల్ మరియు గ్రామ టిడిపి నాయకులు సూరి ఆదిశేషులు సోమన్న మరియు గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు

# కాశిరెడ్డి నాయన అన్న సంతర్పణకు చేయూత



మనగళం, బనగానపల్లె : బనగానపల్లె నేలమట్టం దగ్గర ఉన్న కాశిరెడ్డి నాయన అన్నసంతర్పణకు బనగానపల్లె బీజేపీ నేత బీవీ సుబ్బారెడ్డి చేయూతనిచ్చారు. ఆయన మిత్రుడు శేఖర్ మిత్రబృందం విన్నపం మేరకు బీవీ సుబ్బారెడ్డి, సుశీలమ్మ దంపతులు రూ. 10,001 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బీవీ సుబ్బారెడ్డి దంపతులకు శేఖర్ మిత్రబృందం అభినందనలు తెలిపారు.

# సేవాసమితి ఆధ్వర్యంలో 123వ ఆత్మబంధు అంత్యక్రియ





మన గళండోన్ డోన్ పట్టణ రైల్వే గేట్ల వద్ద ఒక అనాధ యాచకుడు చనిపోయాడు తన దగ్గర ఎటువంటి ఆధార్ కార్డు గాని తనకు సంబంధించిన గుర్తింపు పేపర్లు గాని లేనందువలన తను ఒక అనాధ యాచకుడు అని గుర్తించి మృతదేహానికి అంత్యక్రియలు చేయమని టౌన్ పోలీసు వారు ద్రోణాచలం సేవాసమితి వారికి కోరగా చనిపోయిన వ్యక్తి గురించి టౌన్ సి.ఐ ఇంతియాజ్ బాషాకి తెలిపి చనిపోయిన వ్యక్తి ని హిందూ సాంప్రదాయ పద్ధతిలో డోన్ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది. ఈ పుణ్య కార్యక్రమమునకు అయిన ఖర్చు మొత్తం డోన్ వై.సి.పి నాయకుడు మల్యాల శ్రీనివాస రెడ్డి భరించారు వైకుంఠ రథాన్ని రోటరీక్లబ్ రాజయ్య గౌడ్ ఉచితంగా సమకూర్చారు. ఈ కార్యక్రమం లో ద్రోణాచలం సేవా సైనికులు షాదీఖాన రాజా,సతీష్ (పిట్టి),మరియు డోన్ టౌన్ కానిస్టేబుల్ నాయక్, మునిస్వామి లు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసం, రైతన్నా మీకోసం కార్యక్రమం

**- ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**


మన గళం, గడివేముల : గడివేముల మండలం గని గ్రామం లో రైతు "వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖల" ఆధ్వర్యం లో నిర్వహించిన రైతన్నా - మీకోసం కార్యక్రమం లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గోన్నారు. శనివారం గ్రామ%శీ% లో రైతుల ఇంటింటికి తిరిగి రైతన్నా-మీకోసం పా%శీ%ప్లెంట్ పేపర్ లు పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం లో రైతులకు అండగా అమలుచేసిన పథకాల గురించి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామం లో పారిశు ధ్య సేకరణ నూతన ట్రాక్టర్ ని ప్రారంభించారు అలాగే పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యం లో పశువుల దాన సబ్సిడీ కింద రైతులకు అందజేశారు.



# ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను జయప్రదం చేద్దాం

**- దివ్యాంగులకు అండా, దండగా నిలుద్దాం - ఎంఎల్ఏ, పిఏసి సభ్యుడు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి**

మన గళం,ఎమ్మిగనూరు : శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని శాసనసభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి నివాసంలో రాష్ట్ర "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) గౌరవాధ్యక్షులు మల్లేల ఆల్ఫ్రెడ్ రాజు, అధ్యక్షులు బి సి నాగరాజు ల అధ్యక్షతన డిఈఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో జరపబోయే "ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలు" లో భాగంగా డిసెంబర్ - 14(ఆదివారం) న తాలుకాలోని దివ్యాంగులందరిని క్రోడీకరించి టౌన్ లోని "కుర్ణి కళ్యాణ మండపం" లో "ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం" ను జరపబోతున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు(ఎంఎల్ఏ), పిఏసి సభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డిని ఆయన స్వగ్రుహంలో కలిసి ఆహ్వానించడం తో పాటు ఆయన చేతుల మీదుగా "కరపత్రాలు"," గోడపత్రికలు" లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరు అవుతానని జయప్రదం చేసుకుందామని అలాగే దివ్యాంగులకు ఎప్పుడు వెన్నంటి ఉండడమే గాక వారికి అండగా, దండగా నిలుస్తానని తెలియజేడం జరిగిందని తెలిపారు తప్పకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల్లోని దివ్యాంగులందరూ తప్పకుండా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ జిల్లా మహిళా విభాగం సభ్యురాలు తాలుకా డిఈఎఫ్ అధ్యక్షులు శాకం వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు ఇస్మాయిల్, మండల అధ్యక్షులు ఎం రామకృష్ణ, కో-కన్వీనర్స్ ఉసేని, మహేష్,



ఆర్గనైజింగ్ సెక్రటరీస్ ముస్తాక్, రాజశేఖర్ గౌడ్, ఆఫీసు బాయ్ నర్సింహులు, మీడియా విభాగం సభ్యులు సోమప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం క్షేత్రంలో భక్తజన సంద్రం



మనగళం శ్రీశైలం: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలం క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనార్థమై ఆలయ క్యూలైన్లలో బారులు తీరారు. దీంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర క్యూ లైన్ లన్నీ భక్తులతో కిక్కిరిశాయి.

# ఎమ్మిగనూరు రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం

**- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం**

మన గళం,అమరావతి : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద రెండు కార్లు ఢీకొని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. హృదయ విదారక ఘటనపై స్పందించిన సీఎం చంద్రబాబు..మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



# పార్థివ దేహానికి కాటసాని నివాళి



మన గళం,పాణ్యం : మద్దూరు గ్రామ వైఎస్ఆర్సీపీ నాయకుడు జీ.సురేష్ కుమార్ రెడ్డి పార్థివ దేహానికి వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి నివాళులు అర్పించారు. శనివారం పాణ్యం నియోజకవర్గం,పాణ్యం మండలం, మద్దూరు గ్రామ వైఎస్ఆర్సీపీ నాయకుడు గోపవరం సురేష్ కుమార్ రెడ్డి అనారోగ్యతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మద్దూరు గ్రామానికి వెళ్ళి సురేష్ కుమార్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదం కలచి వేసింది.. మంత్రి బీసీ

మన గళం బనగానపల్లె : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సమీపంలో శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు . గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులకు మంత్రి ఆదేశించడం జరిగింది.



# ఎమ్మెల్యే బి.వి.తీవ్ర దిగ్భ్రాంతి



మన గళం,ఎమ్మిగనూరు : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవి జయనాగేశ్వర్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని చేరుకుని ఘటనను స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మిగనూరు శాసన సభ్యులు డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు, అక్కడి పరిస్థితులను స్థానికులతో, అధికారులతో తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదం పై సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణం మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. రెండు కార్లు ఢీకొన్న ఈ భయానక ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు మృతి చెందడం ఎంతో బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ బీవి జయనాగేశ్వర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

# ఘనంగా రైతన్న మీ కోసం కార్యక్రమం



మన గళం,ఆదోని : శనివారం ఆదోని మండలం బైచిగేరి గ్రామంలో "రైతన్న మీ కోసం %-% రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మాజీ శాసనసభ్యుడు,ఆదోని టిడిపి ఇన్చార్జ్, మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు,ఆధ్వర్యంలో రైతన్న మీకోసం – ముఖ్యఅతిథులుగా కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు తిక్క రెడ్డి, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పాల్గొన్నారు. రైతుల సంక్షేమం,వ్యవసాయ రంగ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించి పరిష్కారంలో భాగస్వాములు కావాలని సూచించారు.అలాగే వ్యవసాయ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, రైతులకు అవసరమైన పరికరాలు, సహాయాలు సమయానుసారంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రంగస్వామి నాయుడు, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, ఎల్ ఎల్ సి టీవీ చైర్మన్ రామస్వామి, జై శంకర్, రంగన్న, ఆదోని టౌన్ అధ్యక్షులు తిమ్మప్ప, మండల అధ్యక్షులు శివప్ప, లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, బసవరాజు, నాగరాజు, రమేష్, ధన సింగ్, రాముడు, సదేష్, భగవాన్ సింగ్, హనుమాన్ సింగ్, వీరసింగ్, లక్ష్మన్న, బాలు, రాజబాబు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.


# కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలి




మనగళం, ఎమ్మిగనూరు : మున్సిపాలిటీలో పనిచేస్తూ మరణించిన 13 మంది పారిశుద్ధ కార్మిక కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏఐటీయూసీ నాయకులు తిమ్మ గురుడు, ఐఎఫ్ టీయూ నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు పదమూడవ రోజు శనివారం కొనసాగాయి. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షులు సుమాల చార్లెస్, మండల కార్యదర్శి ఏసురాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సుమాల చార్లెస్ మాట్లాడుతూ ఎమ్మిగనూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులు ఎవరైతే చనిపోయారో వాళ్ల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు కారుణ్య నియామకాలు చేపట్టడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గత 12 రోజుల నుండి నిరాహార దీక్షలకు పూనుకున్న పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని, తక్షణమే కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టడంలో ఉన్నత అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యేసురాజు మరియు ప్రసన్న కుమార్ కలగట్ల గ్రామ నాయకులు ఏసన్న మరియు ఈరన్న, భాస్కర్, చిన్న మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరు సమస్యలుపై ఎంపికి వినతి.

– ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ.





( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ కోరారు. ఎంపీ బస్తిపాటి నాగరాజును శనివారం వారి స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్పరి మండలంలో తాగునీరు, ఆలూరులో జింకల బెడద ఎక్కువ ఉంది, జింకలు పార్క్ ఏర్పాటు చేయాలి. అలాగే వేదావతి, నగరడోన రిజర్వాయర్ పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, ఆలూరు బెళ్లగుండు ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర కల్యాణ మండపం కట్టాలని కోరారు. గుమ్మనూరు, నంచర్ల, మల్లప్ప గేటు, మొలగవెల్లి రైల్వేస్టేషన్ ను అభివృద్ధి చేయాలని, గతంలో రైలు ఆగేవి, ఇప్పుడు కూడ రైలు ఆపే విధంగా డిఆర్ఎం చర్చించి, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ నాగరాజు సమస్యలుపై సానుకూలంగా స్పందించారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, కూటమి నాయకులు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# మారందొడ్డి గ్రామంలో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



మన గళం సి బెళగల్: సి బెళగల్ మండలంలోని మారందొడ్డి గ్రామం లో రైతన్న మీకోసం అనే కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమాన్ని సి బెలగల్ మండల పార్టీ అధ్యక్షులు మండగిరి చంద్రశేఖర్ చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు రావాలినీ కాబట్టి రైతాంగాన్ని లాభసాటిగా ఆరోగ్యకరంగా మార్చాలని సూచించారు. కార్యక్రమాన్ని ఈనెల 24 నుండి 29 వరకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కేడీసీసీబీ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి మరియు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు నిర్వహించమని తెలిపారు ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరైతు ఇంటిని దర్శించి వ్యవసాయంలో నూతన సాగు విధానాలను అవలంబించాలని రైతులకు వివరిస్తూ ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచేలా, వ్యవసాయంలో తక్కువ నీటితో స్ప్రింకర్ల సాయంతో పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పించలన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎంకిసాన్ సంక్షేమ పథకాల ద్వారా వ్యవసాయంలో రైతుకు పెట్టుబడి సాయం అందిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారులు మరియు నాయకులు జిక్రియ భాష బోయ సోమన్న, పాండు నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 5వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్

– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



మనగళం, కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 5 వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ను నిర్వహించడం జరుగుతోందని, విద్యార్థులు, తల్లితండ్రులు హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మెగా పీటీఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్) 3.0 అంశంపై జిల్లా కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ 3.0 డిసెంబర్ 5 వ తేదీన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు అన్నీ కలిపి మొత్తం 1468 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జరగబోతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను, తల్లి తండ్రులను , పూర్వ విద్యార్థులను, సామాజిక కార్యకర్తలకు, దాతలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు మధ్య బంధం బలపరచడమే మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడే వేదిక ఈ కార్యక్రమం అని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు, వారి మానసిక వికాసం ఎలా ఉంది, ఎక్కడ బలహీనంగా ఉన్నారు, స్పోర్ట్స్ లో ఎలా ఉన్నారు, ఏ విషయాలలో బాగా సపోర్ట్ చేస్తే పైకి వచ్చే అవకాశం ఉంటుందనే విషయాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియచేయడంతో పాటు విద్యార్థులకు సంబంధించిన విషయాలను తల్లితండ్రుల నుండి తెలుసుకుని పరస్పరం విద్యాభివృద్ధి కి కృషి చేసే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యార్థుల ప్రగతి, ప్రవర్తనపై చర్చ జరుగుతుందన్నారు. తల్లిదండ్రులకు హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందచేసి విద్యార్థుల హాజరు, మార్కుకు, ఆరోగ్య వివరాలను అందచేయడం జరుగుతుందన్నారు. స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయని, కిట్ కు, సైన్స్ ప్రాజెక్టుల వంటి ఎగ్జిబిషన్ ల ప్రదర్శనలు ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు 13 రకాల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 5 వ తేదిన ఉదయం 9 గంటలకు మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా అమ్మాయిలు సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేసుకోవాలనే అంశం మీద అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో డ్రాప్ ఔట్ శాతం ఎక్కువగా ఉందని, వాటిని తగ్గించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడాలని సూచించారు. అదే విధంగా బాల్య వివాహాలు చేస్తే ఎటువంటి సమస్యలు తలెత్తుతాయి అనే విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా 7, 8, 9 వ తరగతి విద్యార్థులకు బాల్య వివాహాల పై, సెల్ఫ్ డిఫెన్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల మీద పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని హెడ్ మాస్టర్ లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలల్లో ఒక మహిళా ఉపాధ్యాయురాలిని నోడల్ అధికారిగా నియమించాలని, ఇళ్లలో పిల్లలకు పెళ్లి విషయం గురించి చర్చిస్తున్నట్లయితే, ఆ విషయాన్ని నోడల్ అధికారికి చెప్పే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రాప్ ఔట్ తగ్గడంతో పాటు 10 వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబర్ 5వ తేదీ నాటికి పదవ తరగతి సిలబస్ పూర్తి అవగానే 10 వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా 100 రోజుల ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. 10 వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, సాయంత్రం సమయంలో స్నాక్స్ ఏర్పాటు చేసి, ఎక్కువ సేపు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ప్రెస్ కాన్ఫరెన్స్ లో జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్, సమగ్ర శిక్ష పీఓ లోక్ నాథ్ పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీసుబుధేంద్ర తీర్థ శ్రీపాదులు స్వామిజీ రాక



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణం నందు స్థానికంగా గల ధర్మపురి క్షేత్ర శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయానికి మంత్రాలయం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీసుబుధేంద్ర తీర్థ శ్రీపాదులు స్వామిజీ డిసెంబర్ నెల 23 తారీకున విచ్చేయుచున్నారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయ కమిటీ సభ్యులు అందరూ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూజ్యులు శ్రీశ్రీశ్రీ శుభదేంద్ర తీర్థ శ్రీపాదుల స్వామీజీ రాక సందర్భంగా భక్తులు, సన్మానితులు మరియు స్థానిక ప్రజలు అందరి సహకారంతో ఉత్సాహభరిత స్వాగతం ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్వామిజీ ఆత్మీయ ప్రసంగాలు మరియు ఇందులో భాగంగా స్వామివారు మొక్కలు నాటే కార్యక్రమం అలాగే స్వామి వారు మన నిత్య పూజా విధానాలు గురించి మరియు భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు ఇవ్వనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలియజేశారు కావున ప్రజలందరూ ఈ పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని స్వామిజీ ఆశీర్వాదాలను పొందాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులైన నలుబోలు విజయ భాస్కర్ రెడ్డి, జీతూరి రవికుమార్, మాదుగుండు రాఘవేంద్ర గురుస్వామి, ఏసీ రఘు, జొన్నలగడ్డ కిరణ్ కుమార్ గురుస్వామి, అద్దుగల నాగేశ్వరరెడ్డి, బండా నాగరాజు గురుస్వామి, ఆకుల ధనుంజయ, కోట్రా అశోక్ కుమార్, కామర్తి పాండు స్వామి, నాగేంద్ర స్వామి, మధు స్వామి, శివప్రసాద్ స్వామి, తిమ్మప్ప స్వామి, తదితరులు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## మాజీ మంత్రి శైలజానాథ్ ను కలిసిన చిప్పగిరి వైసీపీ నాయకులు వినోద్ కుమార్.

( ఆలూరు మనగళం ): అనంతపురం పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి శింగనమల నియోజకవర్గం ఇంచార్జి సాకే శైలజానాథ్ ను క్యాంప్ కార్యాలయంలో ఆలూరు వైసీపీ నాయకులు చిప్పగిరి వినోద్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ పార్టీ స్థితిగతులపై మరియు స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలోపేతానికి అందురు కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి శైలజానాథ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చిప్పగిరి వినోద్ కుమార్, దేగులపాడు మంజునాథ్, కరెంటు గోవిందు మరియు ఖాజీపురం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





## శ్రీశైల మల్లన్న సన్నిధిలో యాంకర్ శ్రీముఖి



మనగళం శ్రీశైలం :: శ్రీశైలం మల్లికార్జున స్వామి సన్నిధిలో ప్రముఖ టీవీ యాంకర్, నటి శ్రీముఖి శనివారం ఉదయం పూజలు చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో ఆమె శ్రీ భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు శ్రీముఖికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

## ఏపీ మహిళా సమాఖ్య కోడుమూరు పట్టణ నూతన కమిటీ ఎన్నిక

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణ ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి ఏపీ మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు గిద్దమ్మ ల సమక్షంలో ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి మాట్లాడుతూ సిపిఐ అనుబంధ సంస్థగా ఉన్న ఏపీ మహిళా సమాఖ్య ఎల్లప్పుడూ ప్రజల సమస్యలపై మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతుందన్నారు. మహిళలకు భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై దళితులపై అఘాయిత్యాలు దాడులు జరుగుతున్నా కూడా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మహిళలపై దాడులు చేసేవారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు ఇందులో భాగంగా ఏపీ మహిళా సమాఖ్య కోడుమూరు పట్టణ నూతన కమిటీ

అధ్యక్షులు: శకునమ్మ

కార్యదర్శి: సులోచనమ్మ

ఉపాధ్యక్షులు: 1). గౌరమ్మ

2)నాగలక్ష్మి

3)దస్తగిరమ్మ


సహాయ కార్యదర్శి: 1).గౌరమ్మ

7మంది సమితి సభ్యుల తో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా సభ్యులు సిపిఐ మండల కార్యదర్శి బి రాజు ఏఐటియుసి తాలూకా కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు నాయకులు రుక్మాంధ్ర రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు



## అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

మనగళం శ్రీశైలం :: శ్రీ డి. రామదీక్షితులు, కృష్ణా జిల్లా వారు ఈ రోజు ( 29.11.2025)న అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం రూ. 1,00,000 /-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. శివప్రసాదుకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి



## సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం ::: దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (28.11.2025) శ్రీ మనోజ్ రెడ్డి మరియు వారి శిష్య బృందం, హైదరాబాద్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ కూచిపూడి నృత్యకార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో వినాయక కౌత్వం, శివ తాండవం, అర్ధనారీశ్వరం నమామ్యహ%శీ% కంజదళాయతాక్షి, శివాష్టకం, అంబాష్టకం తదితర గీతాలకు స్నేహలత, శివానీ, లక్ష్మీ, అక్షయ, ధాత్రి, శ్రావ్య, కల్యాణి తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నార కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.



## మల్లిఖార్జున స్వామి కి ఊయలసేవ



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (28.11.2025) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

## శ్రీశైలంలో యువకుడిపై ఎలుగుబంట్ల దాడి

మనగళం శ్రీశైలం :: శ్రీశైలం హటకేశ్వరం గిరిజన గూడెంకు చెందిన కుడుముల చిన్నదేవయ్య అనే యువకుడుపై ఎలుగుబంటి శనివారం దాడి చేసి గాయపరిచింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి కట్టెలు తెచ్చుకునేందుకు వెళ్లగా ఎలుగుబంటి దాడిచేసి తొడను గాయపరిచిందన్నారు. గట్టిగా అరుస్తూ పారిపోతుండగా మరో 2 ఎలుగుబంట్లు దాడి చేసేందుకు ప్రయత్నించాయన్నారు. బాధితుడిని ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



## బాధితులకు అన్ని విధాల న్యాయం చేస్తాం

మనగళం, నంద్యాల : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన బాధితులకు జిల్లా యంత్రాంగం సహకారం అందించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, డిఆర్ఓ రాము నాయక్, నంద్యాల, డోన్ ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, కమిటీ సభ్యులు బాలనాగన్న, నాగరాజు, కాశన్న, దేవదానం, రవికాంత్ బాబు, వెంకటేష్ నాయక్, మురళి తదితర అధికారులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సీ%-%ఎస్టీ కేసుల విషయంలో బాధితుల పట్ల అధికార యంత్రాంగం తక్షణ స్పందనతో ముందుకు రావాలని సూచించారు. కమిటీ సభ్యులు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, బాధితులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గాజులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, మందులు అందకపోతున్నాయన్న సభ్యుల ఆందోళనపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం నుంచి 600 రకాల మందులు నిరంతరాయంగా సరఫరా అవుతున్నందున మందుల కొరతను తక్షణమే నివారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారత ప్రభుత్వం ఆమోదం తెలిపిన 125 విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను మార్చ్ 31లోపు పూర్తి స్థాయిలో ప్రారంభించే దిశగా పనులు జరుగుతున్నాయని వివరించారు. గర్భిణీ స్త్రీల డెలివరీల విషయంలో అధిక శాతం సిజేరియన్ చేస్తున్న మూడు ప్రైవేటు ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 54 శాతం వరకు సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని చెప్పారు. ఏప్రిల్ 2022 నుంచి ఆగస్టు 2025 వరకు 343 మంది నిందితులపై ఎఫ్‌ఐఆర్లు నమోదై, 570 మంది బాధితులకు రూ. 7.84 కోట్లు పరిహారం అందించామని చెప్పారు. అలాగే సెప్టెంబరు 2025 నుంచి నవంబరు 2025 వరకు 22 ఎఫ్‌ఐఆర్లు నమోదై, 69 మంది బాధితులకు రూ. 90.12 లక్షలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. సఫాయి కర్మచారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాలు సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మహానంది దేవస్థానంలో ఔట్సోర్సింగ్ స్కావెంజర్లకు వేతనాలు ఇవ్వడం లేదన్న సభ్యురాలు చెన్నమ్మ అభ్యర్థనపై కలెక్టర్ స్పందిస్తూతాను స్వయంగా మహానంది దేవస్థానాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. సఫాయి కర్మచారులకు బ్లౌజులు, మాస్కులు, సబ్బులు, ఆయిల్, చెప్పులు తదితర అవసరమైన రక్షణ సామగ్రిని అందించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎఫ్‌ఐఆర్ నమోదు విషయంపై బాధితులు స్వయంగా ముందుకు రాకపోవడం ఒక కారణమని, పోలీసులకు తెలిసిన కేసులన్నింటినీ క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం జరిగేలా చూసుకుంటామని ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు.

## మహాపాదయాత్ర-హిందూ సమ్మేళనం కరపత్రాలు విడుదల

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణమందు స్థానికంగా ఎంతో వైభవంగా నిర్మితమవుతున్న "హరి-హర క్షేత్ర" శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 07.12.25 కోడుమూరు లో జరుగబోవు మహా పాదయాత్ర మరియు హిందూ సమ్మేళనం కార్యక్రమ సందర్భంగా స్థానికంగా గల శ్రీరాముల వారి దేవాలయం నుండి హరి-హర క్షేత్ర" శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు ఊరేగింపుగా పాదయాత్ర జరుగును ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపుత్యమార రామానుజ జియరు స్వామి వారు వీరు అష్టాక్షరి పీఠం విజయవాడ నుండి వస్తున్నారు మరియు శ్రీశ్రీశ్రీ అంబాత్రయ క్షేత్ర ఆదిత్య పరాశ్రీ స్వామి వారు వీరు అంబాత్రయ క్షేత్రము బిజ్వార్ గ్రామము నారాయణపేట నుండి విచ్చేయుచున్నారు ఈ కార్యక్రమానికి వేదిక గా హరి-హర క్షేత్ర" శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వేదిక గా ఏర్పాటు చేశారు హిందు సమ్మేళనమునకు పై ఇరువురు మహా స్వాముల వారూ మహాపాదయాత్ర లో విచ్చేయుచున్నారని నిర్వాహకులు తెలియజేశారు ఈ కార్యక్రమం సంబంధించిన కరపత్రాలు స్థానిక "హరి-హర క్షేత్ర" శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు కోడుమూరు హిందుసమ్మేళన కార్య నిర్వహణ సమితి, కోడుమూరు సమస్త దేవాలయముల సమితి, హిందూ బంధువులు మరియు "హరి-హర క్షేత్ర" శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము కమిటీ సభ్యులు విడుదల చేశారు ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని అలాగే ప్రతి ఒక్కరూ స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఈ హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు ప్రజలందరికీ పిలుపునిచ్చారు



## అంకాళమ్మ వారికి విశేష పూజలు

మనగళం శ్రీశైలం :: లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (28.11.2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# మన ప్రభుత్వ వ్యవస్థ లో లోపాలు ఉన్నాయి: కర్నూలు డిఐజి

- కొటేకల్ గ్రామ సమీపం లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదు మంది మృతి – సిట్ బెల్ట్ ధరించడం వలన, తప్పిన ప్రమాదం – సంఘటన స్థలాన్నీ పరిశీలించిన: ఎమ్మెల్యే బీవీ, కర్నూలు డి ఐ జి, జాయింట్ కలెక్టం
- కర్ణాటక వాహన డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ప్రమాదం: జాయింట్ కలెక్టర్ – గాయ పడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

మన భారతదేశంలో చదువు లేకపోయినా డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తున్నారని, ఈ విధానం ఇతర దేశాలలో లేదని, మన ప్రభుత్వ వ్యవస్థ లో లోపాలు ఉన్నాయని కర్నూలు డి ఐ జి కోయ ప్రవీణ్ అన్నారు. ఎమ్మిగనూరు మండలం పరిధి లోని కొటేకల్ గ్రామ నగర వనం సమీపం లో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదు మంది మృతి చెందారు. ప్రమాద సంఘటన స్థలము ను స్థానిక ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర రెడ్డి పరిశీలించి సంతాపం తెలిపారు.కర్నూల్ డిఐజి కోయ ప్రవీణ్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మనదేశంలో ప్రభుత్వ వ్యవస్థ సరిగా లేదని, అందువల్లనే అర్హత లేని వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టే ఇంజనీర్లు ప్రమాదాలు నివారించే విధంగా రోడ్లు ఏర్పాటు చేయాలని డిఐజి సూచించారు. రోడ్డు ప్రమాదం లో వెంకటేశ్ (65) భార్య గౌరమ్మ (60) కూతురు మీనాక్షి, అల్లుడు సతీష్, మనవళ్ళు రిత్విక్, బన్ని గౌడ్ లు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికీ తీవ్రగాయాలు అయ్యాయి ఫార్చునర్, డిజైర్ కార్లు ప్రమాదంలో ఫార్చునర్ కార్ లో ఉన్న వ్యక్తులు సీట్ బెల్ట్ ధరించి ఉండటంతో, కారు ప్రమాదానికి గురైనప్పుడు కారులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడం వలన పెను ప్రమాదం తప్పిందని ఫార్చునర్ లో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు అయినట్లు డి ఐ జి తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ప్రమాదం: కర్నూలు జాయింట్ కలెక్టర్ కొటేకల్ సమీపం లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదు మంది మృతి చెందినారు, ఈ ఘోర రోడ్డు ప్రమాదం కు కారణం కర్ణాటక వాహన డ్రైవర్ నిర్లక్ష్యం మే నని కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్లా ఖ్వామీర్ తెలిపారు. ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కర్నూలు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక నుండి మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి ని దర్శించు కోడానికి కోలార్ జిల్లా, చిక్క ఓసల్లి గ్రామానికి చెందిన 7మంది సభ్యులు డిజైర్ కారులో శనివారం తెల్లవారుజామున మంత్రాలయం కు వెళుతూ.. కర్నూలు నుండి ఆదోని కి వెళుతున్న ఫార్చ్యూనర్ కారు కొటేకల్ గ్రామం, నగర వనం సమీపం లో డీ కొనడం తో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం కు కారణం పొగ మంచు ఉండటం వలన ఆదోని కి వెళుతున్న ఫార్చ్యూనర్ సరైన మార్గం లో వెళుతున్నప్పటికీ కర్ణాటక వాహనం డీ కొట్టడం వలన ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రజల్లో అవగాహన రావాలి: ఎం వి ఐ శశిరా దీపి రోడ్డు ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన రావాలని ఆదోని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శశిర దీప్తి తెలిపారు. శనివారం రోడ్డు ప్రమాద సంఘటన స్థలం కు చేరుకున్న ఎం వి ఐ మీడియాతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల గురించి పలుమార్లు అవగాహన కల్పించినప్పటికీ ప్రజల్లో మార్పు రావడంలేదని, త్వరగా వెళ్ళాలన్న ఆతృత తో అతి వేగంగా వెళ్లడం మూలంగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎం వి ఐ అసహనం వ్యక్తం చేస్తూ, ప్రజల్లో మార్పు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.జూళిబ్జీల/



– ప్రమాదానికి గురైన రెండు వాహనాలు



– రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తులు

## డోన్-ప్యాపిలి మండలాల్లో నీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం ఎమ్మెల్యే కోట్ల, కలెక్టర్

మన గళం డోన్ : డోన్ నియోజకవర్గంలో సాగు నీరు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డితో కలిసి హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా నీటితో నింపబడిన డోన్, ప్యాపిలి మండలాల్లోని అబ్బిరెడ్డిపల్లి, వెంగలాంపల్లి, పిఆర్ పల్లి, గుడిపాడు, చంద్రపల్లి హుసేనాపురం గ్రామాలకు సంబంధించిన చెరువులు, ట్యాంకులను విస్తృతంగా పరిశీలించారు. డోన్ మండలంలోని వెంకటాపురం తుమ్మల చెరువు వద్ద ప్రత్యేక జలహారతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యేతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో ముచ్చటిస్తూ వారి సాగు అవసరాలు, నీటి అందుబాటు, స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. రైతుల అభ్యర్థనలకు అనుగుణంగా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 68 చెరువులుండగా, అందులో నంద్యాల జిల్లాకు చెందిన 35 చెరువుల్లో 7 చెరువులకు హంద్రీ%-%నీవా సుజల స్రవంతి ద్వారా నీరు అందకపోవడంతో తాను ప్రత్యక్షంగా పరిశీలన చేపట్టినట్టు వివరించారు. నీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. మండలాల వారీగా చెరువుల నింపుదల, వాటికి నీటి సరఫరా పరిస్థితులపై మైనర్ ఇరిగేషన్ అధికారులతో సమీక్షించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు ఉన్న అడ్డంకులు తొలగించి రైతులకు సాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు వేగవంతం చేయాలని మైనర్ ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చెరువుల చుట్టుపక్కల పెరిగిన ముళ్ల కంచెలు, అడవి చెట్ల తొలగింపుకు ప్రత్యేక నిధులు కేటాయించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆమె వెల్లడించారు. చెరువులను సుందరీకరించి, గ్రామాల పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. దాదాపు 120 గ్రామాలకు చెరువులు సమీపంలో ఉన్నప్పటికీ కొన్ని చోట్ల తాగునీరుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించిన కలెక్టర్, ఇందుకు అవసరమైన నిధుల అంచనాలను మైనర్ ఇరిగేషన్ శాఖ సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాలకు తాగునీరు అందుబాటులోకి వచ్చేలా త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువులన్నీ నింపుకోవడం ద్వారా వాటర్ టేబుల్ పెరగడంతో పాటు బోర్లు కూడా రీఛార్జ్ అవుతాయని కలెక్టర్ తెలిపారు.వెంకటాపురం నుండి మల్లెంపల్లెకు వెళ్లే మార్గంలో రహదారిపై నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో... ఆ దారిని ఉపయోగించే గ్రామాల ప్రజలు సుమారు 1500 మంది రైతులు రోజూ పొలాలకు తిరగాల్సి రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని...బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, తగిన ప్రతిపాదనలు పంపించి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి కోసం నీటి వనరుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. డోన్ ఆర్డిఓ నరసింహులు, తాసిల్దార్ లు, మైనర్ ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ వెంట వున్నారు.



## డిసెంబర్ 1న కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా

మనగళం, కర్నూలు సిటీ : మెప్మా ఆర్పీల వేతనాలు, వేధింపులు, అదనపు పనికి వ్యతిరేకంగా, మహిళా మార్ట్ శ్రీనిధి డిపాజిట్ వడ్డీలు, అబయ హస్తం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ ఒకటవ తేదీ ఉదయం 10:30 గంటలకు కలెక్టర్ ఆఫీస్ ఎదుట మహాధర్నా చేపడుతున్నట్లు ఏపీ మెప్మా ఆర్పీల ఉద్యోగుల సంఘం నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎంఏ గఫూర్, జిల్లా, న్యూ సిటీ, ఓల్డ్ సిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ అంజిబాబు నగేష్ నరసింహులు, మారెళ్ళ విజయ్, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు పి. నిర్మల, ఆర్పీల సంఘం జిల్లా నగర అధ్యక్ష, కార్యదర్శులు రుద్రమ్మ, ఉమాదేవి, లక్ష్మీబాయిషబాన, కోశాధికారి సుజాత, ప్రసాద్ హాజరవుతారన్నారు. ఆర్పీలు, పొదుపు సభ్యులు తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నగరాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరాభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం, స్థానికంగా తాము చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తున్నామని, ఇటువంటి సమయంలో కొందరు తమపై చేస్తున్న దుష్ప్రచారం తగదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ.భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాడు 18, 8, 45వ వార్డుల్లో రూ.1.61 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి, చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి భూమిపూజలు నిర్వహించారు. 18వ వార్డు జొహరపురం కేసీ కెనాల్ ప్రక్కనున్న క్రైస్తవుల స్మశాన వాటికలో రూ.18 లక్షలతో మౌలిక వసతుల కల్పనకు, 8వ వార్డు పెద్ద పడఖాన కమ్యూనిటీ హాల్ వెనుక దండేగేరి ప్రాంతాల్లో రూ.62 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణానికి, 45వ వార్డు వెంకటరమణ కాలనీ%-%ప్రేమ్‌నగర్ కాలనీల్లో రూ.49 లక్షలతో సీసీ రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "పండ్లు కాసే చెట్టుపైనే రాళ్లు పడతాయి" అనే సామెతను ఉదాహరించారు. పనిచేస్తున్న తమపైనే అవాస్తవాలు, దుష్ప్రచారం జరుగుతోందని మండిపడ్డారు. నగరాభివృద్ధి పరంగా హైకోర్టు బెంచ్ నగర నడిబొడ్డున ఏర్పడటం ఎంతో ముఖ్యమని, ఏ%-%బి%-%సి క్యాంపుల్లో ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా కర్నూలు అభివృద్ధి గురించే ఆలోచన మొదటుంటుందని, గతంలో కర్నూలు కోసం కేంద్ర మంత్రులను కలిసి వచ్చిన దాఖలాలు లేవన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రానికి అభివృద్ధి సాధ్యమని, ప్రజల ఆశీస్సులు కూటమి ప్రభుత్వంపై కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని పత్రికలు ప్రచారం చేస్తున్న అవాస్తవ కథనాలను న్యాయస్థానాల్లో పోరాడతామని స్పష్టం చేశారు. ఓర్వకల్లులో వేల కోట్ల పెట్టుబడులు, వేలాది యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్న సమయంలో కొందరు దీన్ని కూడా ఓర్వలేక విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా అభివృద్ధికి చంద్రబాబు పూర్తిగా కట్టుబడి ఉన్నారని మంత్రి తెలిపారు. నగరంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని, గత పాలకులు పూర్తి మౌలిక సదుపాయాల కల్పనను విస్మరించారని పేర్కొన్నారు. క్రైస్తవ స్మశాన వాటికను గతంలో తమ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి చేశామని, ఇప్పుడు మళ్ళీ తామే అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు పరమేష్, మాణిక్యమ్మ, ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు




మనగళం, నంద్యాల : మత్తు పదార్థాల నియంత్రణను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని నివారణకు కఠిన చర్యలు చేపట్టనున్నట్టు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ తో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్సీ/ఎస్టీ కోర్టు %-% కర్నూలు) వై. శ్రీహరి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, డీఆర్ఓ రాము నాయక్, నంద్యాల, డోన్ ఆర్డీఓలు, మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధిత విభాగాధికారులు కలెక్టర్, ఎస్పీ చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మత్తు పదార్థాల అరికట్టడంలో మొత్తం యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన పర్యవేక్షణతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని, విద్యాసంస్థల స్థాయిలోనే నివారణ చర్యలు బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి నేరుగా సమాచారం సేకరించేందుకు ఐవిఆర్ఎస్, క్యూఆర్ కోడ్, వాట్సాప్ గవర్నర్స్ నెంబరు (9552300009) వంటి పద్ధతులను అమలు చేస్తుందని, ఈ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా వచ్చిన సమాచారం మేరకే జిల్లాలకు ర్యాంకింగ్ ఇవ్వబడుతోందన్నారు. మత్తు పదార్థాల విక్రయం, వాడకం, రవాణాపై ఎప్పటికప్పుడు గమనిస్తూ పర్యవేక్షణను మరింత బలపరచాలని పోలీసు, ఎక్సైజ్ అధికారులను ఆమె ఆదేశించారు. జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల స్థాయిలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణలో మూలాలను గుర్తించి అరికట్టడం అత్యంత కీలకమైందని, దీనివల్ల పెద్ద సమస్యలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యాసంస్థల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, చర్యలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజల్లో చైతన్యం పెంచుతున్నామని చెప్పారు. రైల్వే స్టేషన్లు, రవాణా వాహనాలు, ప్రజా ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయని ఎస్పీ వివరించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 5,781 కేసులు నమోదు చేసి, నిందితుల నుండి రూ. 4,95,830 రూపాయలను వసూలు చేసినట్టు వెల్లడించారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.